క్లుప్తంగా

అర్హులకు కార్పొరేషన్ రుణాలు ఇవ్వాలి

నరసాపురం రూరల్: అర్హులైన కాపు కాపు సోదరులకు కార్పొరేషన్ ద్వారా రుణాలు అందించాలని వైఎస్ పాలెం మాజీ సర్పంచ్ కూనపరెడ్డి వీరవెంకట విజయరంగారావు అన్నారు. సోమవారం రాష్ట్ర కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడును ఆయన నివాసంలో కలిసి వినతి పత్రం అందజేశారు. కూటమి ప్రభుత్వ ఏర్పాటులో కాపు సామాజిక వర్గం ప్రధాన పాత్ర పోషించిందని రంగారావు పేర్కొన్నారు. అయితే రాష్ట్రంలో కాపు సామాజిక వర్గం ఆర్థికంగా వెనుకబడి ఉందన్నారు. కాపుల్లో ఆర్థికంగా వెనుకబడిన పేదలకు రుణాలు మంజూరు చేసి ఇప్పించాలని రంగారావు కొత్తపల్లిని కోరినట్లు తెలిపారు.

భారత్ లౌకిక రాజ్యం



ములపర్రు మసీదుకు క్లాత్ అందించిన మాలమహానాడు నాయకులు

పెనుగొండ: భారత దేశం అన్ని మతాలకు సమ ప్రాధాన్యం ఇచ్చే లౌకిక రాజ్యమని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నల్లి రాజేష్ అన్నారు. మాల మహానాడు ఆచంట మండల అధ్యక్షుడు రావి నాగరాజు సహకారంతో ములపర్రు మసీదుకు క్లాత్ అందించారు. కార్యక్రమంలోజిల్లా అధ్యక్షుడు గుండే నగేష్‌బాబు జిల్లా ఉపాధ్యక్షుడు సరెళ్ల శ్రీనివాస్, పెనుగొండ మండల అధ్యక్షుడు చికిలే కృష్ణబాబు, ఉపాధ్యక్షుడు రొక్కాల విజయగాంధీ, తండా ఇషాకు రాజుచ కేసరపల్లి నాగేశ్వరరావు, కేసరపల్లి గిరి, అరిగెల పుల్లారావు, చిల్లే సురేష్, బోళ్ల ప్రసాద్, రావి వెంకటేశ్వరరావు, పినిపే జ్యోతి బాబు, నేలపూడి వరద రాజు, నేలపూడి గాంధీ, సుబ్రహ్మణ్యం, మర్రే ఇంద్రకిరణ్, విజయ కుమార్ పాల్గొన్నారు.

పెనుమర్రు శివాలయంలో పూజలు



మహిళలకు చీర, పసుపు, కుంకుమలు అందజేస్తున్న పాతూరి వెంకట సుబ్బలక్ష్మి

యలమంచిలి: ఉగాది ఉత్సవాల్లో భాగంగా పెనుమర్రు గ్రామంలోని శ్రీఉమాపార్వతి సమేత వైద్యనాథేశ్వరస్వామి ఆలయంలో సోమవారం కైలాస గౌరీ నోము నిర్వహించారు. ఆలయ అర్చకులు బాదంపూడి వరప్రసాద్ శర్మ బ్రహ్మత్వంలో గ్రామానికి చెందిన పాతూరి వెంకట సుబ్బలక్ష్మి, ఆమె కుమార్తె రుద్రరాజు హైమావతి పీటలపై కూర్చుని ఈ నోము చేశారు. విఘ్నేశ్వర పూజ, కైలాస గౌరీ పూజ, నోము అనంతరం ప్రసాదంగా గ్రామంలోని 825 మంది మహిళలకు పసుపు, కుంకుమ, చీర, రవిక, గాజులు తాంబూలంగా అందజేశారు. ఈ క్రతువులో భాగంగా బుధవారం గ్రామంలోని ప్రతి హిందువు బంధువుల గడప గడపకూ బొట్టు పెట్టి పసుపు, కుంకుమలు పంపిణీ చేస్తామని ఆలయ నిర్మాణ కర్త పాతూరి సోమరాజు వివరించారు.

జనరల్ మర్చంట్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

భీమవరం: భీమవరం జనరల్ మర్చంట్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. స్థానిక ఛాంబర్ఆఫ్ కామర్స్ భవనంలో అయితా వెంకటకృష్ణారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో అధ్యక్ష, కార్యదర్శులుగా ఏవీఆర్ సభాపతి, ఆర్‌వీ ప్రసాదరావు, ఉపాధ్యక్షుడిగా తుమ్మల పెంట లక్ష్మీనారాయణ, సహాయ కార్యదర్శిగా వబిలిశెట్టి ప్రసాదరావు కోశాధికారిగా సన్నిధి అచ్యుతరామయ్యలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యవర్గం 2027 వరకు అధికారంలో ఉంటుంది. అలాగే భీమవరం ఛాంబర్ ఆఫ్ కామర్స్ కార్యవర్గానికి జనరల్ మర్చంట్స్ అసోసియేషన్ నుంచి ఏవీఆర్ సభాపతి, గ్రంధి సత్యరవితేజ, ఆర్‌వీ ప్రసాదరావు, టి రంజిత్‌కుమార్‌లను ఎన్నుకున్నారు.

బీసీ బిడ్డను కొట్టి చంపిన వారిని శిక్షించాలి



బడుగు బాలాజీ

ఉండి: అధికార మదంతో బీసీ బిడ్డని కొట్టి చంపిన జనసేన రౌడీమూకలను వెంటనే అరెస్టు చేసి శిక్షించాలని వైఎస్సార్ సీపీ జిల్లా మాజీ అధికార ప్రతినిధి బడుగు బాలాజీ సోమవారం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లాలోని వీరవాసరం మండలం నందమూరు గరువు గ్రామానికి చెందిన మైనర్ బాలుడు అయిన కానాసి రాజేష్ అనే 15 ఏళ్ల బీసీ బిడ్డపై దాడి చేసిన జనసేన పార్టీ గ్రామాధ్యక్షుడు, అతని సోదరుడు మరికొందరు జనసేన రౌడీ మూకలు దారుణంగా దవడలపై కొట్టి, గుండెలపై గుద్దడంతో శ్వాస ఆడక పడిపోయిన బాలుడిని కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించారన్నారు. అతడిని పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారన్నారు. జనసేన రౌడీమూకలకు బీసీ బిడ్డలు బలైపోతున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఈ విషయంపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రమాదకరంగా స్పీడ్ బ్రేకర్లు

- రోడ్డు మరమ్మతు ప్రాంతాల్లో కనిపించని స్పీడ్ బ్రేకర్లు
- రంగులు వేస్తే ప్రమాదాలను అరికట్టొచ్చు



టిడ్కో గృహాల సముదాయంలో తెలుపు రంగు వేసిన స్పీడ్ బ్రేకర్లు

పాలకొల్లు సెంట్రల్: రోడ్డుపై ప్రమాదకర మలుపుల్లో వేసే స్పీడ్ బ్రేకర్లు ఎక్కడపడితే అక్కడ దర్శనమిస్తున్నాయి. ఈ స్పీడ్ బ్రేకర్లు వలన ఎంత ఉపయోగం ఉందో అంత ప్రమాదం కనిపిస్తుంది. ప్రధాన మలుపులు వచ్చే ప్రాంతంలో వేగాన్ని తగ్గించడానికి నిబంధనల ప్రకారం స్పీడ్ బ్రేకర్లు వేస్తుంటారు. అవి కొందరు వాహనదారులకు శరాఘాతంగా తయారయ్యాయి. యువకులు వాహనాలను అతి వేగంగా నడుపుతున్నారు. కొందరు వాహనదారులు తమ సమయాన్ని బట్టి ఒక్కోసారి వేగంగా వెళుతుంటారు. ఇలా వేగంగా వెళ్లే సమయంలో కొన్ని చోట్ల దగ్గరకు వచ్చే వరకూ స్పీడ్ బ్రేకర్లు కనిపించడం లేదు. ఆ సమయంలో ఆదమరిచి కూర్చుంటే ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఇటీవల రోడ్లు అధ్వానంగా ఉండడంతో రోడ్ల మరమ్మతులు చేస్తున్నారు. ఈ సందర్భంలో స్పీడ్ బ్రేకర్లపై రోడ్లు వేసుకుంటూ వెళుతున్నారు. దీంతో స్పీడ్ బ్రేకర్ల ఎత్తు తగ్గడం ఒక కారణమైతే నూతనంగా తారు రోడ్డు వేయడంతో ఎండకు దూరం నుంచి చూస్తుంటే స్పీడ్ బ్రేకర్లు సరిగా కనిపించడం లేదు. ఇటీవల పాత బస్టాండ్ సెంటర్ నుంచి కొమరాడ రోడ్డుకు వెళుతున్న దంపతులకు రోడ్డు మరమ్మతుల కారణంగా స్పీడ్ బ్రేకర్ ఎత్తు తగ్గి రోడ్డులో కలిసిపోయింది. దీంతో ఆ వాహనదారుడు దగ్గరకు వచ్చేసరికి సడన్ బ్రేక్ వేయడంతో వాహనం వెనుక కూర్చున్న భార్య రోడ్డుపై పడి పోయింది. స్థానికులు వచ్చి ఇక్కడ స్పీడ్ బ్రేకర్ కనిపించక చాలా మంది పడిపోతున్నారని తెలిపారు.

స్పీడ్ బ్రేకర్లకు రంగులు వేయాలి

సీసీ రోడ్లుపై వేసే స్పీడ్ బ్రేకర్లు ఇంకా ప్రమాదకరంగా ఉంటున్నాయి. సీసీ రోడ్డుపై కొద్దిపాటి ఇసుక ఉందంటే బ్రేక్ నొక్కితే వాహనం స్కిడ్ అవుతుంది. పాలకొల్లు టిడ్కో గృహాల వద్ద ఎంట్రన్స్ గేటు సమీపంలో సీసీ రోడ్డుపై స్పీడు బ్రేకర్లు వేశారు. అక్కడ ఆ స్పీడ్ బ్రేకర్లపై తెలుపు రంగు వేయడంతో కొంత వరకూ ప్రమాదాలు తక్కువగా ఉంటున్నాయి. కొత్తగా వెళ్లే వారికి దగ్గరకు వచ్చే వరకూ కనిపించక పోవడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. స్పీడ్ బ్రేకర్ వేసిన ప్రతి చోట రంగు వేయాలని వాహనదారులు కోరుతున్నారు. అంతే కాకుండా బోల్ట్‌లతో రంగులతో ఉండే ప్లాస్టిక్ స్పీడ్ బ్రేకర్లు అక్కడక్కడా వేస్తున్నారు. అలాంటివి ఏర్పాటు చేసినా ప్రమాదాలను నివారించొచ్చని వాహనదారులు అభిప్రాయపడుతున్నారు. ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి స్పీడ్ బ్రేకర్ల వెడల్పును బట్టి రంగులు వేయాలని వాహనదారులు కోరుతున్నారు.

పోలీసుల అనుమతి తప్పనిసరి



ఎవరైనా వచ్చి పలానా సెంటర్‌లో స్పీడ్ బ్రేకర్ వేయమని లెటర్ పెడితే వేయడం కుదరదు. అవి వేయడానికి ముందుగా పోలీసుల అనుమతి అవసరం. ఇక్కడ ప్రమాద సంఘటనలు ఎక్కువగా ఉన్నాయని వారి దర్యాప్తులో నిర్ధారణ చేసి ప్రదేశం చూపిస్తే ఆ ప్రాంతంలో మాత్రమే స్పీడ్ బ్రేకర్లు వేస్తాం. నేషనల్ హైవేస్‌లో స్పీడ్ బ్రేకర్లు వేయడం కుదరదు. కాని వాటికి ఆనుకుని ఉన్న సర్వీస్ రోడ్లకు మాత్రమే స్పీడ్ బ్రేకర్లు వేయడానికి వీలుంటుంది. సహజంగా స్కూల్ జోన్లు, ప్రమాదకరమైన మలుపుల్లో మాత్రమే నిబంధనల మేరకు స్పీడ్ బ్రేకర్లు వేస్తాం. కొన్ని జాతీయ రహదారుల్లో రంబుల్ స్ట్రిప్స్ వేస్తుంటాం. స్పీడ్ బ్రేకర్లు ఉన్న ప్రాంతాల్లో తెలుపు రంగు వేయాలని పలువురు సూచిస్తున్నారు. అలా రంగులు వేయడానికి ఉన్నతాధికారులతో చర్చించి త్వరలో ఏర్పాటుకు కృషి చేస్తాం.

–మూర్తి, ఆర్అండ్‌బీ ఏఈఈ, పాలకొల్లు

శ్రీధర్‌కు కళారత్న అవార్డు

పాలకొల్లు సెంట్రల్: పట్టణానికి చెందిన డాక్టర్ పాలపర్తి శ్రీధర్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేతుల మీదుగా కళారత్న అవార్డు అందుకున్నారు. ఆదివారం విజయవాడ తుమ్మలపల్లి క్షేత్రంలో నిర్వహించిన ఉగాది వేడుకల్లో ఈ పురస్కారం అందుకున్నట్లు శ్రీధర్ తెలిపారు. శ్రీధర్ మాట్లాడుతూ వృత్తి రీత్యా ప్రభుత్వ సాంఘిక సంక్షేమ శాఖలో పని చేస్తూ ప్రవృత్తిగా సాహిత్యంతో రచనలు చేస్తుంటానని అన్నారు. గత 40 సంవత్సరాల సాహిత్య సేవలో 75 పైగా రచనలు చేసినట్లు తెలిపారు. పురస్కారం అందుకున్న శ్రీధర్‌కు పట్టణంలో పలువురు అభినందనలు తెలిపారు.

అయ్యప్పపై దాడి దారుణం

పెనుగొండ: హైకోర్టు న్యాయవాది కోటిపల్లి అయ్యప్పపై హత్యాయత్నం చేయడం దారుణమని, దోషులను కఠినంగా శిక్షించాలని సౌత్ ఇండియా కాపు అసోషియేషన్ జిల్లా అధ్యక్షుడు గంటా రాజు డిమాండ్ చేశారు. అవినీతిని ప్రశ్నించినందుకు న్యాయవాదిపై 10 మంది కత్తులతో దాడి చేయడాన్ని ప్రతి ఒక్కరూ ఖండించాలని పిలుపునిచ్చారు. పోలీసులు నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అగ్ని ప్రమాదంలో రూ.10 లక్షల ఆస్తి నష్టం



మంటలను అదుపు చేస్తున్న ఫైర్ సిబ్బంది

నరసాపురం: పట్టణంలోని 14వ వార్డు గోదావరి గట్టు కొండాలమ్మ గుడి ప్రాంతంలో కారిచర్ల శివ అనే యువకుడు నడుపుతున్న సోఫా తయారీ షాపులో అగ్ని ప్రమాదం జరిగింది. ప్రమాదంలో సోఫాల తయారీకి ఉపయోగించే కొబ్బరి పీచు, పలు రకాల ఫోంలు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఉదయం 10 గంటల ప్రాంతంలో షాపు తాళం వేసి ఉండగా లోపల నుంచి మంటలు రావడాన్ని గమనించి స్థానికులు అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. రెండు ఫైరింజన్లు వచ్చి మంటలు అదుపు చేశాయి. మంటలు పక్కనున్న మరో నివాస భవనానికి కూడా వ్యాపించబోయాయి. అయితే సకాలంలో ఫైరింజన్లు రావడంతో ప్రమాదం తప్పింది. సుమారు రూ.10 లక్షల ఆస్తి నష్టం సంభవించిందని అగ్నిమాపక శాఖ అధికారులు చెప్పారు. ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

హామీల అమలుపై చిత్తశుద్ధి లేదు

పెనుమంట్ర: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రజలకు మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చి ఏడాది దగ్గర పడుతున్నా ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయలేదని పెనుమంట్ర జెడ్పీటీసీ సోమవారం ఒక ప్రకటనలో ఎద్దేవా చేశారు. చంద్రబాబు మోసపూరిత హామీలు నమ్మి మోసపోయిన ప్రజలు ఆ హామీలను చిత్తశుద్ధితో అమలు చేయాలని కోరుతున్నారు. ఉపాధ్యాయుల నియామకంపై మొదటి సంతకం చేస్తానని ప్రగల్భాలు పలికిన చంద్రబాబు, మెగా డీఎస్సీని కుంటిసాకులతో అటకెక్కించారని, బాబు మాయ మాటలు నమ్మి నిరుద్యోగులు ఇప్పుడు ఆర్థికంగా, మానసికంగా నలిగిపోతున్నారని హామీలు ఇచ్చిన పథకాలు అమలు చేయడానికి కమిటీలు వేయాలంటూ సంక్రాంతి, ఉగాది, దసరాలలో అమలు చేస్తామంటూ ప్రజలను మోసం చేస్తూ వస్తున్నారని, అది ఏసంవత్సరమో తెలియజేయకుండా పండుగల పేరు చెప్పి పబ్బం గడుపుతున్నారని ఆమె విమర్శించారు. ఉచిత బస్సు, ఉచిత ఇసుక అటకెక్కిందనిఅన్నారు. రూ.10 వేలు జీతం ఇస్తానని వలంటీర్లను నమ్మించి నిలువునా మోసం చేశాడన్నారు. అమ్మఒడి డబ్బులు వేయకపోవడంతో తల్లులు తీవ్రంగా నష్టపోతున్నారని విమర్శించారు.

కొవ్వొత్తులతో క్రైస్తవుల శాంతి ర్యాలీ



పాలకొల్లు సెంట్రల్: కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న విశ్వాసులు



పెనుమంట్ర: రోడ్డుపై బైఠాయించి నిరసన చేస్తున్న క్రైస్తవ సంఘాల నేతలు

పాలకొల్లు సెంట్రల్: క్రైస్తవ మత బోధకుడు ప్రవీణ్ పగడాల మృతికి సంతాపంగా పట్టణంలోని పెదపేటలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఆదివారం రాత్రి నిర్వహించిన ఈ ర్యాలీలో క్రైస్తవ విశ్వాసులు, పాస్టర్లు, సంఘ పెద్దలు పాల్గొన్నారు. ప్రవీణ్ కేసులో తగిన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ప్రవీణ్ పవిత్ర ఆత్మకు శాంతికలగాలని ఆయన కుటుంబానికి తమ ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. పట్టణ పలు వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాస్టర్ చిలకపాటి కుమార్, ప్రసాద్ బాబు, సంఘ పెద్దలు పాల్గొన్నారు.

ప్రవీణ్ పోస్టుమార్టం రిపోర్టును విడుదల చేయాలి

పెనుమంట్ర: పాస్టర్ పగడాల ప్రవీణ్ పోస్టుమార్టం రిపోర్టును తొందరగా రిలీజ్ చేసి, ప్రవీణ్‌ది హత్యా, ప్రమాదవశాత్తు జరిగిందా అనేది తేల్చి చెప్పాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్ డిమాండ్ చేశారు. సోమవారం సాయంత్రం ఆచంట నియోజకవర్గ పాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మార్టేరు సెంటర్‌లో కొద్దిసేపు నిరసన ప్రదర్శన, కోడేరు రోడ్డులో శాంతి ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న పుష్పరాజ్ మాట్లాడుతూ పాస్టర్‌ది హత్య అయితే దోషులను కఠినంగా శిక్షించాలని, క్రైస్తవులపై దాడులను అరికట్టాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి నేతల సువర్ణరాజు, జిల్లా అధ్యక్షుడు ఇంటి సువర్ణకుమార్, ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు నేతల సాల్మన్‌రాజు, క్రైస్తవ సంఘాల నాయకులు గుత్తుల సాల్మన్‌దొర, ఉన్నమట్ల మునిబాబు, ఈది ప్రవీణ్, బొర్రా రవికుమార్, కుసుమే వెంకటేశ్వరరావు, పెద్ద ఎత్తున ఆచంట నియోజవర్గానికి చెందిన క్రైస్తవ పెద్దలు, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పట్టణంలో తాండవిస్తున్న అపారిశుద్ధ్యం



కోవెలగుడి వీధిలో మెయిన్ రోడ్డుపై ఉన్న చెత్త కుప్పలు

నరసాపురం: మున్సిపాలిటీలో పారిశుద్ధ్య నిర్వహణ నానాటికీ లోపభూయిష్టంగా మారుతుంది. 31 వార్డులు, 60 వేల జనాభాతో విస్తరించి ఉన్న పట్టణంలో మున్సిపల్ అధికారులు పారిశుద్ధ్య నిర్వహణలో పూర్తి అలసత్వం ప్రదర్శిస్తున్నారు. ఫలితంగా పట్టణంలో ప్రధాన మార్కెట్ ప్రాంతంలో కూడా రోడ్డుపై చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. ఇక పట్టణంలో ఎక్కడపడితే అక్కడ ఆవులు, దూడలు, పందులు రోడ్లపై తిరుగుతున్నాయి. అవన్నీ చెత్త కుప్పల వద్దకు చేరుతుండటంతో పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. అధికారులు వార్డు పర్యటనలు అంటూ హడావుడి చేస్తున్నా కూడా క్షేత్ర స్థాయిలో మాత్రం మార్పు రావడం లేదు. ముఖ్యంగా శానిటరీ సెక్షన్ పనితీరు అధ్వానంగా ఉండటంతో ఈ పరిస్థితి తలెత్తింది. ఇప్పటికైనా అధికారులు పరిస్థితి బాగు చేయాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

భక్తి శ్రద్ధలతో రంజాన్ ప్రార్థనలు



నరసాపురం: ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లిం సోదరులు

నరసాపురం: పవిత్ర రంజాన్ పర్వదిన ప్రార్థనలు సోమవారం నరసాపురంలో ఘనంగా నిర్వహించారు. మిషన్ హైస్కూల్ రోడ్డులోని మసీదు వద్ద ఉదయం నుంచి ముస్లిం సోదరులు ప్రార్థనలు నిర్వహించారు. ఒకరికొకరు రంజాన్ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. పలువురు రాజకీయ ప్రముఖులు ప్రార్థనల్లో పాల్గొని ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు చెప్పారు. తోటివారి మేలు కోరడమే రంజాన్ పండుగ విశేషమని చెప్పారు. అంజుమన్ సంఘ అధ్యక్షుడు షేక్ బులిమస్తాన్, కౌన్సిలర్ షేక్ యాకూబీబీ, ముస్లింపెద్దలు దావూద్ ఖాన్, షేక్ సిలార్‌సాహెబ్, బడావలీ, ఇమామ్ ఆలీ, భాషాఖాన్, హౌలాలీ తదితరులు పాల్గొన్నారు.

దుస్తులు, స్వీట్ల పంపిణీ

పాలకొల్లు సెంట్రల్: సేవకు, దానధర్మాలకు నెలవైన పండుగ రంజాన్ అని వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి కర్రా జయసరిత అన్నారు. సోమవారం రంజాన్ పండుగ సందర్భంగా స్థానిక 8వ వార్డు బంగారు వారి చెరువుగట్టు ప్రాంతంలో పేద ముస్లిం సోదరీమణులకు చీరలు, స్వీట్ బాక్సులు అందజేశారు. ఈ సందర్భంగా రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పెచ్చెట్టి కృష్ణాజీ, కొర్రగింజల హనుమంతురావు, షేక్ వలీ, జోగి వెంకటేశ్వరరావు, మామిడిశెట్టి చిట్టిబాబు, జోగాడ ఉమామహేశ్వరరావు, రామాంజుల చిన్నమదు, కొండా గణేష్, శంకరాపు శ్రీను, షేక్ సుబ్హాని పాల్గొన్నారు.

ప్రత్యేక ప్రార్థనలు

పెనుగొండ: ముస్లిం సోదరులు రంజాన్ పండుగను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. నెల రోజుల పాటు ఉపవాస దీక్షలు చేసిన ముస్లిం సోదరులు ఆదివారంతో ఉపవాస దీక్షలు విరమించారు. ఈదుల్ ఫీతుల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పెనుగొండ మండలంలోని పెనుగొండ, సిద్ధాంతం, ములపర్రు మసీద్‌లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సోదర భావం పెంపొందించి ఒకరికి ఒకరు సహాయ సహకారాలు అందించే సందేశాన్ని రంజాన్ ఇస్తుందన్నారు. ముస్లిం సోదరులు ఒకరికి ఒకరు ఈద్ ముబారక్ చెప్పుకున్నారు.



పాలకొల్లు సెంట్రల్: ముస్లిం మహిళలకు చీరలు అందజేస్తున్న జయసరిత



పెనుగొండ: సిద్ధాంతంలో ఈద్ ప్రార్థనలు

ఘనంగా అమ్మవార్ల జాతర



పుంతలో ముసలమ్మ అమ్మవారు

నరసాపురం రూరల్: మండలంలోని చిట్టవరం గ్రామంలో వేంచేసియున్న శ్రీమారెమ్మ, పొల్లమ్మ, చింతాలమ్మ అమ్మవార్ల జాతర మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఏప్రిల్ 6వ తేదీ వరకూ అమ్మవారి జాతర మహోత్సవాలు నిర్వహించేందుకు కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. గ్రామానికి చెందిన పైడికొండల కృష్ణ ఆర్థిక సహకారంతో ఆదివారం అఖండ అన్న సమారాధన నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఎల్బీచర్ల గ్రామంలో వేంచేసియున్న ముత్యాలమ్మ అమ్మవార్ల ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. జాతరను పురస్కరించుకుని ఆలయాల వద్ద పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ ఉత్సవం ఐదు రోజుల పాటు నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. కొప్పర్రులో గ్రామ దేవత పుంతలో ముసలమ్మ అమ్మవారి ఉత్సవాలు ఉగాది సందర్భంగా ప్రారంభమయ్యాయి. సోమవారం వందలాది మంది భక్తులు పాల్గొని దేవతామూర్తులను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాల్లో పలువురు ప్రజా ప్రతినిధులు కూడా పాల్గొని అమ్మవార్లను దర్శించుకున్నారు.

దుర్గమ్మకు మహా కుంభం



అన్నసమారాధనలో పాల్గొన్న మహిళలు

ఆకివీడు: స్థానిక జవహర్ పేటలోని దుంపగడప రైల్వే గేటు వద్ద కనక దుర్గమ్మ ఆలయం ఆరోవ వార్షికోత్సవం ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా అమ్మవారికి ఆయా ప్రాంతాల్లోని భక్తులు మహా కుంభం సమర్పించారు. కావిళ్లతో స్వీట్లు, అన్నం, పసుపు కుంకుమ, గాజులు తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించారు. అనంతరం అఖండ అన్నసమారాధ జరిగింది. అన్నసంతర్పణ కార్యక్రమానికి నగర పంచాయతీ విప్ పడాల శ్రీనివాస రెడ్డి, మోటుపల్లి ప్రసాద్, నొకట్ల రామారావు, రామ రాజు, బచ్చు సరళ, ఉత్సవ కమిటీ ప్రతినిధులు పొట్లూరి రాజేష్, ఊడిగ శ్రీనివాస్, రాంబాబు, మంగరాజు, నాగరాజు, వారణాసి శ్రీను, బొమ్మి యశోద కృష్ణ,అధిక సంఖ్యలో మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్మార్ట్ మీటర్లు మాకొద్దు



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

భీమవరం: విద్యుత్ స్మార్ట్ మీటర్ మా ఇంటికి వద్దంటూ సీపీఎం ఆధ్వర్యంలో ముద్రించిన స్టిక్కర్స్‌ను సోమవారం భీమవరం సీపీఎం కార్యాలయం వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆపార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు బి బలరామ్, జిల్లా కార్యదర్శి జెఎన్‌వి గోపాలన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై భారాలు వేసే విధంగా విద్యుత్ స్మార్ట్‌మీటర్స్ బిగించేందుకు రంగం సిద్ధం చేస్తోందని, ప్రభుత్వ నిర్ణయాన్ని ప్రజలంతా తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. స్మార్ట్‌మీటర్లు కారణంగా ప్రజలపై చార్జీలు పెరిగి పెనుభారంగా మారతాయని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలో ఉండగా ఆదానితో చేసుకున్న సెకి విద్యుత్ ఒప్పందం ప్రజలపై విపరీతమైన భారం పడుతుందని ప్రతిపక్షంలో ఉన్న తెలుగుదేశం ఎన్నికల ప్రచారంలో గగ్గోలు పెట్టిందని ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు నాయుడు, యువగళం పాదయాత్రలో లోకేష్ తీవ్రంగా వ్యతిరేకించి స్మార్ట్‌మీటర్లు పగలగొట్టండని పిలుపునిచ్చి అధికారంలోకి వచ్చాక నాలిక మడతవేసి మాట మార్చి విద్యుత్ స్మార్ట్ మీటర్లను ప్రతి ఇంటికి బిగించడానికి రంగం సిద్ధం చేయడం దారుణమన్నారు. ఖరీదైన స్మార్ట్ మీటర్ల ఖర్చు కూడా ప్రతి నెల బిల్లులో ప్రజలే భరించాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. వినియోగదారులు ఎక్కువ విద్యుత్ వినియోగిస్తున్న సమయంలో యూనిట్ రేట్లు ఎక్కువగా ఉంటుదని వీటివల్ల రైతాంగం, ప్రజలపై పెనుబారాలు పడనున్నాయన్నారు. ప్రజలపై పడుతున్న విద్యుత్ భారాలపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నోరుమెదపకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు బి వాసుదేవరావు, జక్కంశెట్టి సత్యనారాయణ, మామిడిశెట్టి రామాంజనేయులు, మల్లిపూడి ఆంజనేయులు, కె రత్నకుమారి, ఎం.లత తదితరులు పాల్గొన్నారు.